క్లుప్తంగా

స్పెషలాఫీసర్‌గా పీడీ



బాధ్యతలు తీసుకుంటున్న ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి

యల్లనూరు: జిల్లా ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డికి యల్లనూరు మండల స్పెషలాఫీసరుగా జిల్లా కలెక్టరు వినోద్‌కుమార్ బాధ్యతలను అప్పగించారు. సోమవారం రఘునాథ్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి నుంచి స్పెషలాఫీసర్ల పాలన నెలకొంది. అనంతరం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ వీరరాజును అడిగి సమస్యలు తెలుసుకున్నారు.

బావిని పూడ్చి.. ఆక్రమించారు



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తుడు పెద్దిరెడ్డి

శింగనమల: నార్పల మండలంలోని బి.పప్పూరులో గ్రామ దేవత పెద్దమ్మ గుడికి చెందిన చేద బావిని గ్రామానికి చెందిన సంజీవ అనే వ్యక్తి పూడ్చి వేసి ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జేసీ కేతన్‌గార్గ్‌కు పెద్దిరెడ్డి అనే వ్యక్తి వినతిపత్రం అందజేశారు. బావి వద్ద పెద్దమ్మ స్వామికి కుంభకుడు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించే వారికి, ఆలయ పూజరులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, అధికారులకు తెలియకుండా చేదబావిని గత నెల 30న పూడ్చి వేశారన్నారు. ఈ స్థలాన్ని ఆక్రమించుకోవడానికీ ప్రయత్నిస్తున్నారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు.

పరిశుభ్రత పాటించండి



పోస్టర్లు విడుదలచేస్తున్న డాక్టర్ ఉషారాణి

పెద్దపప్పూరు: వ్యాధుల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలని మండల వైద్యురాలు ఉషారాణి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో ఆమె ఇంటింటికీ తిరిగి డెంగీ, మలేరియా తదితర వ్యాధులు ఎలా వస్తాయి? వాటి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న విషయాల్ని వివరించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉన్నచోట సున్నపు పొడి, బ్లీచింగ్ పౌడర్, వేస్టు ఆయిల్ చల్లితే నీటిలో ఉన్న లార్వాలు, దోమలు నశిస్తాయన్నారు. జ్వరం వచ్చిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ కమలాబాయి, హెల్త్ సూపర్‌వైజర్ శర్మాస్ వలి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయం వద్ద అన్నదానం

పుట్లూరు: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో దాతల సహకారంతో గత 37 వారాలుగా ప్రతి సోమవారం అన్నదానం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో దాతలు ఆర్.ఓబులేసు, రామేశ్వరరెడ్డి, మద్దిలేటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం చేయండి



ఎంఈఓకు వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

శింగనమల: నీట్ పరీక్ష రద్దు చేయాలని, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఈనెల 4న దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా శింగనమల నియోజకవర్గంలో సమ్మెను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాచేపల్లి సూర్యప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షులు తరిమెల గిరి కోరారు. సోమవారం శింగనమల ఎమ్మార్సీలో ఎంఈఓలు నరసింహారాజు, శివప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జాతీయ స్థాయిలో పరీక్షలను నిర్వహించడంలో విఫలమైందన్నారు. ఈ నెల 4న కేజీ నుంచి పీజీ వరకూ విద్యా సంస్థలు బంద్‌కు ఐక్య విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయన్నారు. విద్యాసంస్థలు సహకరించాలని వారు కోరారు.

వైద్యులు.. కనిపించే దేవుళ్లు

● ఘనంగా వైద్యుల దినోత్సవం

గుంతకల్లుటౌన్: సమాజంలో అత్యంత పవిత్రమైన, కీలకమైన వృత్తి వైద్యం. ఆపద సమయంలో ప్రజలందరికీ ఆపద్బాంధవుడిలా కనిపించే వైద్యులు కనిపించే దేవుళ్లతో సమానమని వక్తలు కొనియాడారు. సోమవారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ప్రజలకు విశిష్ట వైద్యసేవలందిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్‌రెడ్డి, ప్రభుత్వ వైద్యులు కళ్యాణ్, సుజాత, శ్రీనివాసయాదవ్‌తో పాటు వైద్యులు గుప్తా, మూర్తి, విక్రమ్, విజయ్‌మోహన్‌రెడ్డిని రోటరీక్లబ్ సభ్యులు సన్మానించారు. అలాగే జాతీయ చార్టెడ్ అకౌంటెంట్స్ డే సందర్భంగా ఓబులేసుకుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శివానంద, శ్రీనివాసులు, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అర్చన కార్వా, సునీత, రొటేరియన్లు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే మెన్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రైల్వే ఆస్పత్రిలో ఆల్ ఇండియా డాక్టర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రైల్వే ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులను నేషనల్ వైద్య సేవారత్న అవార్డుతో ఘనంగా సత్కరిస్తూ ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రైల్వే ఉద్యోగులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని విరూపాక్షిరెడ్డి ఫంక్షన్ హాల్లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం డాక్టర్స్ డే, ఆడిటర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్ విరూపాక్షిరెడ్డి, డాక్టర్ సురేష్ బాబు, మక్బూల్, చైతన్య, జిలాన్ తదితరులు పలువురు వైద్యులను సన్మానించారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు.



గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రిలో వైద్యులను సన్మానిస్తున్న రొటేరియన్లు



తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రిలో కేక్ కట్ చేస్తున్న వైద్యులు

తాడిపత్రి అర్బన్: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ప్రపంచ వైద్యుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డేవిడ్ సిల్వన్ రాజు ఆధ్వర్యంలో సివిల్ సర్జన్లు, జూనియర్ డాక్టర్లు కేక్‌ను కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో వైద్యులు తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి ప్రజలకు చేసిన సేవలు మరువలేనివన్నారు. వైద్య వృత్తిని అంకిత భావంతో నిర్వహించాలని జూనియర్ వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంఓ క్రిష్ణవేణి, వైద్యులు యస్దాన్, ఉషా పరిమళ, భగీరథ, వసీం అక్రమ్, ఇమ్మాన్యుయేల్, శ్రీనివాసరెడ్డి, మంజుల, మధులత, జాహ్నవి, సాబా, స్టాఫ్ నర్సులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పామిడి: దేవుని తర్వాత దేవుడంతటివారు వైద్యులని పామిడి టీసీ హైస్కూల్ ఎన్‌సీసీ యూనిట్ అధికారి రామాంజనేయులు అన్నారు. సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన మాట్లాడారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగుల ప్రాణాలను కాపాడే డాక్టర్లు ప్రాణదాతలు అన్నారు. అనంతరం యూనిట్ ఆధర్యంలో స్థానిక కమ్యూనిటీ హాస్పిటల్ వైద్యాధికారి శివకార్తీక్‌రెడ్డిని ఆయన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ యూనిట్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లులోని రైల్వే ఆస్పత్రిలో వైద్యులను సత్కరిస్తున్న దృశ్యం



గుత్తి ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ ఎల్లప్పకు స్వీట్లు తినిపిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు



పామిడిలో కమ్యూనిటీ హాస్పిటల్ వైద్యాధికారి శివకార్తీక్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

ప్రభుత్వ ఐటీఐలో రెండో విడత అడ్మిషన్లు

గుంతకల్లుటౌన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో రెండో విడత అడ్మిషన్స్ ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ సీహెచ్ విద్యాసాగర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, ఒరిజినల్ సర్టిఫికేట్లతో ఐటీఐ కళాశాలలో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేయించుకున్న వారు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హులన్నారు. ఈ నెల 24లోగా ప్రభుత్వ వెబ్‌సైట్ ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

అర్బన్ సీఐగా ఇస్మాయిల్



తాడిపత్రి అర్బన్: తాడిపత్రి అర్బన్ సీఐగా ఇస్మాయిల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పని చేస్తున్న నాగేంద్రప్రసాద్ సిక్ లీవుపై వెళ్లారు. దీంతో అనంతపురం సీసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఇస్మాయిల్‌ను తాడిపత్రి అర్బన్ సీఐగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఎల్ఐసీలో 2,700 పోస్టులను భర్తీ చేయాలి

తాడిపత్రి అర్బన్: జీవిత బీమా సంస్థలో దేశ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 2,700 పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ తాడిపత్రి శాఖ ప్రధాన కార్యదర్శి జి.రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తూతూమంత్రంగా 'గ్రీవెన్స్'

పామిడి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డే తూతూమంత్రంగా సాగింది. కేవలం తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఈఓఆర్డీ బీవీ శశికళ, ఒకరిద్దరు అధికారులు మినహా ఎవ్వరూ హాజరు కాలేదు. ప్రభుత్వపరంగా అన్ని శాఖల అధికారులు తప్పక పాల్గొని ప్రజావేదికలో వచ్చే సమస్యల తక్షణ పరిష్కారం చేపట్టాలన్న ఉద్దేశ్యంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ గ్రీవెన్స్‌డేను ప్రభుత్వం చేపట్టింది. అయితే అధికారుల నుంచి స్పందన కరువైంది. చాలా మంది అధికారుల గైర్హాజరుతో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. దుమ్మా కొట్టే అధికారులను అడిగేవారు లేకపోవడంతో గ్రీవెన్స్‌డే అభాసుపాలవుతోంది.



గ్రీవెన్స్ సెల్‌లో ఖాళీ కుర్చీలు

డెంగీ వ్యాధిపై నిర్లక్ష్యం తగదు



తాడిపత్రిలోని శ్రీనివాసపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



గార్లదిన్నె పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడిపత్రి అర్బన్: డెంగ్యూ వ్యాధిపై నిర్లక్ష్యం తగదని ప్రభుత్వ వైద్యాధికారి సయ్యద్ ముష్కిన్ హక్ అన్నారు. డెంగీ వ్యాధి మాసోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని ట్రిబుల్ ఎస్ పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలు పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం శ్రీనివాసపురంలో డెంగీ వాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసులు, రామకృష్ణ, ఏఎన్ఎం సంతోషమ్మ, కమ్యూనిటీ ఆర్గనైజర్ శంకర్, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్లు గౌతమి,దిలీప్ కుమార్ సూచించారు.సోమవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది డెంగీ వ్యతిరేక మాసోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లోక్‌నాథ్, ఆరోగ్యవిస్తరణ అధికారి నాగేశ్వ రయ్య, పీహెచ్ఎన్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని ఎంగిలిబండ గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడి చంద్రశేఖర్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. గుంతకల్లు పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన చంద్రశేఖర్ వ్యక్తిగత పనిమీద రాయలచెరువుకు వెళ్లాడు. పని ముగించుకుని ఆదివారం అర్ధరాత్రి గుంతకల్లుకు బయలుదేరాడు. ఎంగిలిబండ గ్రామ శివారులో ముందు వెళ్తున్న లారీని తప్పించబోయి ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు వెంటనే 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అతడిని అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడికి గాయాలు



తీవ్రంగా గాయపడిన యాచకుడు

గార్లదిన్నె: మండల కేంద్రం 44వ జాతీయ రహదారిపై తాజ్ దాబా సమీపంలో సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో యాచకుడికి తీవ్రగాయాలయ్యాయి. దాబా సమీపంలో యాచకుడు రోడ్డు అవతలివైపు దాటుతుండగా.. గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు 108 వాహనంలో అతడిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మొరాయించిన ఈ-పాస్ మిషన్లు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని పలు స్టోర్లలో ఈ-పాస్ యంత్రాలు మొరాయించాయి. దీంతో రేషన్ సరుకుల కోసం కార్డుదారులు ఇబ్బంది పడ్డారు. సుమారు రెండు గంటల పాటు ఈ -పాస్ యంత్రాలు పని చేయకపోవడం కొందరు కార్డుదారులు ఇళ్లకు వెళ్లిపోయారు. రెండు గంటల తర్వాత ఓ మోస్తారుగా ఈ-పాస్ యంత్రాలు పని చేశాయి.

ఇంటింటికీ రేషన్ పంపిణీ

పామిడి: పట్టణంలో సోమవారం ఇంటింటికి రేషన్ పంపిణీ చేపట్టారు. ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికి వెళ్లి రేషన్‌కార్డుదారులకు సరుకులు పంపిణీ చేశారు. రేషన్ పంపిణీని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ పర్యవేక్షించారు.

రేషన్ పంపిణీ చేయండి

శింగనమల: శింగనమల, నార్పల మండలాల్లో ఎండీయు వాహనాల ద్వారా జూలై నెలకు సంబంధించిన రేషన్ పంపిణీ చేయాలని తహసీల్దార్లు లక్ష్మీనారాయణ, మోహన్‌బాబు, సీఎస్‌డీటీ రాజశేఖర్ తెలిపారు. సోమవారం వారు వేర్వేరు కార్యక్రమాల్లో మాట్లాడారు.

సజావుగా పింఛన్ల పంపిణీ

సాక్షి నెట్‌వర్క్: గుంతకల్లు మండలంలోని కసాపురం గ్రామంలో గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకు ముందు ఆయన కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గుంతకల్లు మండలంలో 6,235 మంది పింఛన్ లబ్ధిదారులకు గతంలో రూ.2.75 కోట్లు పంపిణీ చేస్తే, ఇప్పుడు రూ.4.25 కోట్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి, తహసీల్దార్ శేషఫణి, ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి తదితరులు పాల్గొన్నారు. అలాగే యల్లనూరు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సోమవారం శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పింఛనుదారులకు పింఛన్లను అందజేశారు. అలాగే ఇంటింటికీ రేషన్ బియ్యం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు అదేవిధంగా పుట్లూరు మండలంలోని మడుగుపల్లిలో, శింగనలమలలోని ఎస్సీ కాలనీ, గార్లదిన్నెలోని ఎస్సీ కాలనీ, నార్పల మండలంలోని బి.పప్పూరులో ఎమ్మెల్యే పింఛన్లు పంపిణీ శారు. కాగా శింగనమల మండలంలోని నాగులగుడ్డం తండాలో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయకుండా ఒక చెట్టు కిందకు పింఛన్‌దారులను పిలిపించి పంపిణీ చేశారు. సోషల్ మీడియాలో వైరల్ కావడంతో , ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. గుత్తి మున్సిపాలిటీ పరిధిలో పింఛన్ల పంపిణీని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు పర్యవేక్షించారు. గుంతకల్లు పట్టణంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య పరిశీలించారు. అలాగే తాడిపత్రి మున్సిపల్ పరిధిలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా ప్రారంభించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్లు అబ్దుల్ రహీం, సరస్వతి, మున్సిపల్ డీఈ వెంకటసుబ్బయ్య, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పామిడి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు తదితర మండలాల్లో పింఛన్లు పంపిణీ చేశారు.



కసాపురంలో పింఛన్ల పంపిణీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



గార్లదిన్నెలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రావణి శ్రీ

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి



గుంతకల్లు మండలం నాగసముద్రంలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం



పెద్దవడుగూరులో పోస్టర్లు విడుదల చేస్తున్న తహసీల్దార్ శేషారామ్‌సింగ్



బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడులో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

గుంతకల్లు రూరల్: డయేరియాపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో శ్రీనివాసులు రెడ్డిసూచించారు. సోమవారం మండల పరిధిలోని నాగసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్‌కుమార్ బాబు, తహసీల్దార్ శేషఫణితో కలిసి ఆయన స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా డయేరియా లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించే పోస్టర్లను వైద్య సిబ్బందితో కలసి ఆర్డీఓ ఆవిష్కరించారు. పరిశుభ్రమైన ఆహారం, పరిసరాల పరిశుభ్రతతోనే డయేరియా నుంచి కాపాడుకోగలమని, వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు డయేరియా లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం డయేరియా నివారణపై పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషారామ్‌సింగ్, ఎంఈఓ రాముడు, వైద్యుడు శ్రీనివాసబాబు , సూపర్ వైజర్ నాగలక్ష్మమ్మ, శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: మండలంలోని కొర్రపాడులో డయేరియా మాసోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొర్రపాడు పీహెచ్‌సీ వైద్యులు ఇందిర, వినోద్, సీహెచ్‌ఓ మోహన్ బాబు, పర్వీన్, కేశవయ్య, శ్రీదేవి, రాజేంద్ర, హరిత, ఆశా వర్కర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం, కస్తూరిభా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యుల ఆధ్వర్యంలో డయేరియాపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. వైద్యులు గౌతమి, దిలీప్‌కుమార్, వైస్ ఎంపీపీ కుంచం రామ్మోహన్‌రెడ్డి, ఎంఈఓ చంద్రనాయక్, సీహెచ్‌ఓ లోక్‌నాథ్, ఆరోగ్యవిస్తరణ అధికారి నాగేశ్వరయ్య, ఐసీడీఎస్ సూపర్ వైజర్ వాణిశ్రీ, కస్తూరిబా గాంధీ పాఠశాల ఎస్ఓ నాగసత్య, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో సోమవారం ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ ఎల్లప్ప ఆధ్వర్యంలో స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



గార్లదిన్నె కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



గుత్తిలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు



అప్పటి అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తాడిపత్రిటౌన్: తాడిపత్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2000–2003లో బీకాం చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అప్పటి అధ్యాపకులను సన్మానం చేశారు. కార్యక్రమానికి చీఫ్‌గెస్ట్‌గా వద్ది సత్యం, అప్పటి అధ్యాపకులు నాగేశ్వరెడ్డి, శివయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు విజయలక్ష్మి, మల్లికార్జున, రంగనాద్‌బాబు, అరుణ్‌కుమార్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడిపత్రి డివిజన్
9912220722, 9010223701
9912220732, 9010588846